అక్కడంతా సెపరేటు

- థియేటర్లలో అధిక ధరలకు విక్రయిస్తున్న తినుబండరాలు
- ఖాళీ అవుతున్న ప్రేక్షకుల జేబులు

బోట్‌క్లబ్: మనకు ఇష్టమైన హీరో సినిమా వచ్చిందంటే తప్పనిసరిగా థియేటర్‌కు వెళ్లి చూస్తాం. ఎంత ఖర్చు అయినా పర్లేదని అనుకుంటాం. అయితే ఇదే అదును చూసి అభిమానులు జేబులు గుల్ల చేస్తున్నారు థియేటర్ యజమానులు. సినిమా విరామంలో ప్రేక్షకులు తినుబండరాలు కొనుగోలు చేస్తే షాక్ కొట్టేలా ఉంటున్నాయి అక్కడి రేట్లు. బయట మార్కెట్‌లో రేట్లకు అక్కడ రేట్లుకు వ్యత్యాసం సగం పైడినే ఉంటుంది. సినిమా విరామంలో కూల్ డ్రింక్స్, సమోస, పాప్‌కార్న్, వెజ్‌పఫ్, ఎగ్‌పఫ్, ఉల్లి సమోస, ఐస్‌క్రీమ్, కోల్డ్ కాఫీ విత్ ఐస్ క్రీమ్ వంటి తినుబండరాలు బయట మార్కెట్ కంటే రెండు రెట్లు అధికంగా విక్రయిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇక్కడ రేట్లు ఇలానే ఉంటాయని థియేటర్ సిబ్బంది ప్రేక్షకులపై రుబాబు చేస్తున్నారు. దాదాపు నగరంలోని అన్ని థియేటర్లులో ఇదే పరిస్థితి ఉంది.



కాకినాడ ఒక థియేటర్‌లో ఐస్‌క్రీమ్, సమోస, వెజ్‌పఫ్ రేట్లు

థియేటర్‌లో తినుబండరాలు ఎక్కువ రేట్లు కదా అని బయట కొనుగోలు చేసుకొని తీసుకొని వెళుతుంటే థియేటర్ సిబ్బంది అడ్డుపడుతున్నారని ప్రేక్షకులు గగ్గోలు పెడుతున్నారు. థియేటర్‌లోనికి ఏమీ పట్టుకొని వెళ్లకుండా అక్కడ చెకింగ్ చేసి మరీ లోపలికి పంపుతున్నారు. ఇక మల్టీప్లెక్సు థియేటర్‌లో అయితే అసలు ప్రేక్షకుల ఏమీ పట్టుకొని వెళ్లకుండా అక్కడ సిబ్బంది నియంత్రిస్తున్నారు.

ధరల పట్టిక

తినుబండారాలు	బయట మార్కెట్	థియేటర్
ఐస్‌క్రీమ్	రూ. 20	రూ. 50
కోల్డ్‌కాఫీ విత్ ఐస్‌క్రీమ్	రూ. 40	రూ. 80
వెజ్‌పఫ్	రూ.8	రూ. 20
ఎగ్‌పఫ్	రూ.15	రూ.30
ఉల్లి సమోస	రూ.8	రూ. 15
కూల్‌డ్రింక్	రూ.10	రూ. 20

చాలా దారుణం



ఇటీవల చిరంజీవి వాల్తేరు వీరయ్య సినిమాకు వెళ్లాను. నా భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి సినిమాకు వెళితే సినిమా టిక్కెట్లు రూ.400 ఖర్చయ్యింది. సినిమా విరామ సమయంలో డ్రింక్, సమోస, పాప్‌కార్న్ కొనుగోలు చేస్తే రూ. 250 ఖర్చయ్యింది. ఇది చాలా దారుణం ఇవే వస్తువులు బయట కొనుగోలు చేస్తే రూ.120 అవుతుంది. అధికారులు చర్యలు తీసకోవాలి.

– గున్నాబత్తుల స్వామి, ప్రేక్షకుడు

తగ్గించిన సినిమా టికెట్ల ధర

కొత్త సినిమా వచ్చిందంటే చాలు థియేటర్ యజమానులు అధిక రేట్లకు టిక్కెట్లు విక్రయించే పద్ధతికి ప్రభుత్వం ఇటీవల స్వస్తి పలికింది. దీంతో చిన్న, మధ్య తరగతి ప్రజలకు కూడా కుటుంబంతో సహా థియేటర్‌కు వచ్చి సినిమా చూస్తున్నారు. టిక్కెట్లు రేట్లు తగ్గించడంతో సంబరపడుతున్న ప్రేక్షకులు తినుబండరాలు రేట్లు చూసి అవాక్కవుతున్నారు. ఈ ధరలు కూడా తగ్గించాలని కోరుతున్నారు.

దంత వైద్యులకు సన్మానం

కాకినాడ రూరల్: జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దంత వైద్యులు అడ్డాల సత్యనారాయణ, సతీష్, సువర్ణరాజు, రఘురామ్‌లను అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ ఘనంగా సన్మానించారు. డాక్టరు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ దంత వైద్యం మన మొత్తం ఆరోగ్యానికి అంతర్లీనంగా ఉంటుందన్నారు. ముఖం నిండుగా అందంగా కనిపించాలంటే మన దంతాలు సక్రమంగా ఉండాలన్నారు. నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు. బుద్ధరాజు సత్యనారాయణరాజు, శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, అడబాల సత్యనారాయణ, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.


వైద్యులను సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ తదితరులు

దంత సంరక్షణ అవసరం

బాలాజీచెరువు: దంత సంరక్షణపై అశ్రద్ధ వద్దని, వయస్సుతో సంబంధం లేకుండా పంటి సమస్యలు వస్తున్నాయని సూర్యచంద్ర దంత ఆసుపత్రి వైద్యులు సలాది సూర్యకమల పేర్కొన్నారు. టుటౌన్ వద్ద ఉన్న తన వైద్యశాలలో సోమవారం నేషనల్ డెంటిస్ట్ డే సందర్భంగా దంత సంరక్షపై అవగాహన సదస్సు నిర్వహించి, తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు తెలిపారు.అనంతరం మహిళలకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు చేశారు. ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ సలాది సూర్యకిరణ్ పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

బాలాజీచెరువు: విద్యార్థులకు చదువు ఒకటే ప్రామాణికం కాదని, సామాజిక అంశాలపై అవగాహన కలిగించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పేర్కొన్నారు. ఆదిత్య జగన్నాథపురం పాఠశాల 33వ వార్షికోత్సవం సందర్భంగా ఔద్ధత్య పేరుతో ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన ఇలక్కియ మాట్లాడుతూ మొబైల్ ప్రపంచంలో మునిగిపోతున్న నేటి తరం విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో అవసరమని జాయింట్ పిల్లలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, విద్యతో పాటు క్రీడల్లోనూ పాల్గొనాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో విద్యార్థులు ఆసక్తి చూపుతున్న అంశాలకి ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి చేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఆదిత్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు నల్లమిల్లి శేషారెడ్డి, పాఠశాల డైరక్టర్ శృతిరెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని సుప్రజారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లారీ యజమానుల సంఘం ధర్నా

కాకినాడ సిటీ: పెద్దాపురం పరిధిలోని పరిశ్రమల నుంచి ఎగుమతి అవకాశాలు కల్పించాలని కోరుతూ పెద్దాపురం లారీ యజమానుల సంఘ ప్రతినిధులు సోమవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మారిశెట్టి రామాంజనేయులు, నడిపూడి రమణ మాట్లాడుతూ పెద్దాపురం పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలు తమ లారీ యూనియన్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. గతంలో ఉన్న యూనియన్ నియంతృత్వ పోకడలతో న్యాయం జరగక తాము వీడి కొత్త సంఘం ఏర్పాటు చేసుకున్నామన్నారు. లలితా ఇండస్ట్రీ అధినేత మట్టే శ్రీనివాస్ వ్యక్తిగత స్వార్థంతో తమను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తమ సంఘంలో 16 మంది సభ్యులు, 70 మంది డ్రైవర్లు, క్లీనర్లు, 30 లారీలతో లోడ్ లేకుండా ఉన్నామని, అధికారులు తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

కళాకారుడు భాస్కరరావుకు సత్కారం


భాస్కరరావును సత్కరిస్తున్న నాటక పరిషత్ సభ్యులు

కొత్తపల్లి: నాటక రంగమే తన జీవితమని ప్రముఖ మేకప్, సెట్టింగుల కళాకారుడు కర్రి భాస్కరరావు అన్నారు. మండలంలోని కొండెవరంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో కళాకారులకు మేకప్, సెట్టింగ్‌లు వేస్తున్న భాస్కరరావును ఆదివారం రాత్రి నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కొండెవరంలోనే పుట్టానని, తన తండ్రి నూకరాజు నాటక రంగంలో స్థిరపడి పేరు ప్రఖ్యాతలు సాధించారన్నారు. వారసత్వంగా తాను కూడా ఇదే రంగంలో స్థిరపడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో పలు నాటకాలకు మేకప్, సెట్టింగ్ ఆర్టిస్ట్‌గా పని చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాటక కళాపరిషత్ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీరాములు, ఆర్గనైజర్ బర్రే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

కొత్తపల్లి: మూలపేటలో వేంచేసిన జగన్నాథస్వామి (మొండి జగ్గప్ప), సత్యనారాయణస్వామి వార్ల రథోత్సవం సోమవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం ఆలయ పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రాత్రికి విద్యుత్ దీపాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి వార్ల రథోత్సవం వైభవంగా జరిగింది. భక్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఎస్సై రామలింగేశ్వరరావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, కో ఆప్షన్ సభ్యులు కారే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో రెండో రోజు ఆదివారం రాత్రి హైదరాబాదుకు చెందిన కళాంజలి వారితో మనిషి మంచోడే, చిలకలూరిపేటకు చెందిన మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ వారితో మృత్యుపత్రం నాటికలు ప్రదర్శించారు. వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ, కళా పరిషత్ చైర్మన్ మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మనిషి మంచోడే

ధనం మనిషిని నడిపించే ఇంధనం. ఆ ఇంధనం కోసం ఒక్కొక్కరూ ఒక్కోలా నటిస్తారనే విషయాన్ని మనిషి మంచోడే నాటికలో కళాకారుడు కళ్లకు కట్టినట్లుగా చూపించారు. కన్న తల్లిదండ్రులకు చెప్పకుండా ప్రేమించి పెళ్ల చేసుకున్న ఓ జంట వేరే కాపురం పెడతారు. అబ్బాయికి తన చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్క తన భార్యను పోషించుకోవడానికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు అబద్దం చెప్పి అడ్డదారుల్లో రాత్రిపూట దొంగతనం అలవాటుగా మలుచుకుంటాడు. తనమీద అనుమానం పడిన ఇంటి యజమాని అబ్బాయి నిజస్వరూపాన్ని బయటపెట్టడానికి, బుద్ధి చెప్పడానికి చేసిన ప్రయత్నమే ఈ నాటిక. ఈ నాటికలో మాధవి, మహేంద్ర, కొల్లా రాధాకృష్ణ, సీహెచ్ హరిబాబు నటించారు.


మనిషి మంచోడే నాటికలో ఓ సన్నివేశం

మంచిని మేల్కొలిపే మృత్యుపత్రం

సమాజంలోని అవినీతి, దురాక్రమణలు, దుష్ట సంప్రదాయాలను ఎండగడుతూ మంచికి, మానవత్వానికి పట్టం కడుతూ సమాజానికి మేలు చేయాలనే వృత్తాంతంలో ఈ నాటకం సాగుతుంది. ప్రస్తుతం చదువులేని, చదువుకున్న మనుషుల్లో సైతం స్వార్థం పెరిగిపోయిందని డబ్బు సంపాదనలో పడి చదువు, ఉద్యోగాలను తాకట్టు పెట్టి శవాలుగా జీవిస్తున్న సంఘటనలను ఈ నాటికలో కళాకారులు కళ్లకు కట్టినట్టు చూపించారు. నాటికలో వీసీహెచ్ ప్రసాద్, ఎం.రవీంద్రబాబు, వై.భవాని, పి.తిరుమలరావు, వై.భవానీ నటించారు.

ఉత్పత్తిదారుల సంఘంతో రైతులకు మేలు


రైతు ఉత్పత్తిదారుల సంఘ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్

పిఠాపురం: హరితవన రైతు ఉత్పత్తిదారుల సంఘంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పిఠాపురం ఇన్‌చార్జి ఉద్యాన శాఖాధికారి పి.అరుణ్‌కుమార్ అన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో నిర్మాణంలో ఉన్న హరితవన రైతు ఉత్పత్తిదారుల సంఘ భవన నిర్మాణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు రైతు బజారు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజారు కార్డుల కోసం రైతులు తమ సమీప రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న వారు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. హరితవన రైతు ఉత్పత్తిదారుల సంఘం వల్ల రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని తగిన రేటు వచ్చిన తరువాత అమ్ముకోవడం ద్వారా లాభాలు పొందవచ్చన్నారు. ఎవరికి వారే తమ పంటలను నేరుగా అమ్ముకోవడానికి ఈ సెంటర్లు ఎంత గానో ఉపయోగపడతాయని చెప్పారు.

ప్రజా సమస్యలపై సత్వర 'స్పందన'

- గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు
- స్పందనకు పది అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. వారం వారం నిర్వహించే స్పందనలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి పది అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్ స్థాయి స్పందనకు ఆయా శాఖల నుంచి డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులు స్పందనకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ వారం స్పందనకు తొమ్మిది ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్ తదితరులున్నారు.

జేఎన్‌టీయూకే సందర్శన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం యూనివర్సిటీ తొలి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య సోమవారం జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీను సందర్శించారు. వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజుతో సమావేశమై డైరెక్టరేట్లు, వాటి పనితీరు, పరిశోధనాభివృద్ధి, ప్రయోగశాలకు సంబంధించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలగా ఉంటూ వర్సిటీగా ఏర్పడిందని, అదే విధంగా విజయనగరం కళాశాల వర్సిటీగా ఏర్పడి పరిపాలన పరంగా మరింత సౌలభ్యంగా మారిందని వీసీ ప్రసాదరాజు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన వర్సిటీకు తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ సుమలత, డీఏఏ సీహెచ్ సాయిబాబు, డీఏపీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వీసీ ప్రసాదరాజుతో సమావేశమైన గురజాడ విజయనగరం వర్సిటీ వీసీ వెంకట సుబ్బయ్య

పారిశుధ్యంపై నిర్లక్ష్యమా?

సిబ్బంది పనితీరుపై మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం

కాకినాడ: పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన 7వ డివిజన్ పోస్టల్‌కాలనీ, రేచర్లపేట, మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. రోడ్లపై అక్కడ చెత్త అక్కడే ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని కమిషనర్ హెచ్చరించారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఆ దిశగా శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ముఖ్యంగా ప్రజలు చెత్తను రోడ్లపైన, డ్రైనేజీల్లో వేయవద్దని, అలా వేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కార్పొరేషన్‌లో స్పందన

కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతీ దరఖాస్తుకు పరిష్కారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అడ్డాల సేవలు అభినందనీయం

బోట్‌క్లబ్: గత 25 సంవత్సరాలుగా దంత సేవలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అడ్డాల సత్యనారాయణ సేవలు అభినందనీయమని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో సోమవారం జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ దంత వైద్యులు, జాతీయ పురస్కార గ్రహీత అడ్డాల సత్యనారాయణను ఎంపీ సత్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయన అందిస్తున్న సేవలు కొనియాడదగినవన్నారు. లయన్స్‌ప్రొఫెషనల్ క్లబ్ మాజీ అధ్యక్షుడు నిమ్మకాయల వేంకటేశ్వరరావు మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాల్లో ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.


అడ్డాల సత్యనారాయణను సత్కరిస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత

బాలికలు టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి

కాకినాడ సిటీ: బాలికలు వ్యక్తిగత, సామాజిక భద్రతకు టెక్నాలజీని వినియోగించుకోవాలని రంగరాయ మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శైలజ అన్నారు. జన విజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో ఏఎస్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళల వ్యక్తిగత, సామాజిక భద్రత అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమత కన్వీనర్ చల్లా ఉమామంగతాయారు మాట్లాడుతూ మహిళా సాధికారతపై పాటలు పాడి చైతన్యం కలిగించారు. వేదిక నగర అధ్యక్షుడు ఆలపాటి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ మాట్లడుతూ మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను గురించి వివరించారు. శాస్త్రీయ దృక్పథంతో మహిళలు మెలుగుతూ, సమైకృతో తమ హక్కులను సాధించుకోవాలన్నారు.



వ్యాసరచన పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కార్యక్రమంలో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు, సువర్చల, ఝూన్సీలక్ష్మి తదితరులు మాట్లాడారు. మహిళలు వ్యక్తిగత సామాజిక భద్రత అంశంపై బాలికలకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపల్లి: మండలంలోని శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడులో నూతనంగా నిర్మించిన గొల్లమారెమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ రావి రమేష్ ఆధ్వర్యంలో అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీత, జనసేన పార్టీ నాయకుడు పిల్లా శ్రీధర్, సప్తగిరి హేచరీస్ ఎండీ పెదబాబు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. భక్తుల ఆర్థిక సహాయంతో మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.


అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే దొరబాబు

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు

సామర్లకోట: వివిధ ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇవ్వాలనే నిబంధనల మేరకు ఆయా పాఠశాలల్లో ఉచితంగా ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉచిత విద్యకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏప్రిల్ 4వ తేదీ వరకూ ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు ఉందని ఆయన తెలిపారు.

నేడు కుక్కుటేశ్వరుని వసంతోత్సవం

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి వసంతోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ప్రభాకరరావు తెలిపారు. మహా శివరాత్రి అనంతరం 16వ రోజు వసంతోత్సవం నిర్వహిస్తారని చెప్పారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరుని హుండీల రాబడి రూ.4.87 లక్షలు

బోట్‌క్లబ్: స్థానిక వెంకటనగర్‌లోని వేంకటేశ్వర స్వామి హుండీలను సోమవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 82 రోజులకు గాను రూ.4.87 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి తెలిపారు. దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణికుమార్ సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌కర్సో-2కే23 టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 18, 19 తేదీల్లో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌కర్సో-2కే23 టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. సోమవారం తన చాంబర్ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్, బ్రోచర్, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ ఫెస్ట్‌లో భాగంగా నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, వినూత్న ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని, వర్సిటీకు అనుబంధంగా ఉన్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి కె.రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పది మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

కాకినాడ లీగల్: కాకినాడ టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరచగా కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్నలక్ష్మి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు తదితరులు

కరప: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూములు సారవంతమవడంతోపాటు ఆరోగ్యవంతమైన పంటలు పొందవచ్చని గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి పేర్కొన్నారు. కరపలో సోమవారం ఏపీసీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సిబ్బంది, విద్యార్థులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి వి.సునీల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్‌కుమార్, హైస్కూలు హెచ్ఎం యు.లీలామనోహర్, ఎంటీ ధనలక్ష్మి, పీఆర్పీ గొంతెమ్మ తదితర సీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలి


యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్నా చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: ఏలేశ్వరం నగర పంచాయతీలో 14 డ్వాక్రా గ్రూపుల సభ్యులకు రూ.కోటి రుణం ఇప్పించినట్టు మోసం చేసిన యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ అవినీతికి పాల్పడిన డ్వాక్రా యానిమేటర్లు సుంకర దుర్గ, మోగడా రమణమ్మ, నాగం నాగలక్ష్మి, నగర పంచాయతీ ఉద్యోగి రామోజీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఐ ఎంఎల్ నాయకులు వినోద మిశ్రా, కోసిరెడ్డి గణేశ్వరరావు, డ్వాక్రాగ్రూపుల నాయకురాళ్లు కాపారపు శాంతికుమారి, మసిరపు సుంకరమ్మ, తుమ్ము సత్యవేణి, రాచెల్లి సత్యవతి, గంపల రాజులమ్మ, అంతిరెడ్డి ఏసమ్మ, రాచర్ల అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

కరప: రాష్ట్రంలో అభివృద్ధితోపాటు, ప్రజాసంక్షేమం సాధించాలంటే టీడీపీ తిరిగి అధికారంలోకి రావాలని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. మండలం వాకాడలో సోమవారం ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కల్సి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించి, ఆమె మాట్లాడారు. కరపత్రాలు పంచారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, బుంగా సింహాద్రి, పెంకే సోమరాజు, కామిరెడ్డి సురేష్, బొంతు లోవరాజు, లకమన సూరి, సీహెచ్ జయేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.